క్లుప్తంగా

సమస్య పరిష్కరించయ్యా...



తెనాలిటౌన్: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జనసేన క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో పట్టణ, రూరల్ ప్రాంతాల నుండి ప్రజలు అర్జీలతో మంత్రికి తమ సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి నోచుకున్నవాటిని అక్కడిక్కడే పరిశీలించి పరిష్కరించారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం



తెనాలిటౌన్: స్థానిక నాజర్‌పేటలోని వివేక కిడ్స్ ప్యారడైజ్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో గురువారం అదనపు తరగతి గదులను ప్రముఖ స్వామిజీ భాస్కరనంద సరస్వతీ ముఖ్యఅతిథిగా పాల్గొని వారు ప్రారంభించారు. ఈ ఏడాది చదువులకు వచ్చిన చిన్నారుల మనస్సు దోచే విధంగా ఆహ్లాదకర వాతావరణంలో వసతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్వామిజీ పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రాయపాటి శివనాగేశ్వరరావు, విద్యాసంస్థల చైర్మన్ రావిపాటి వీరనారాయణ, సీఈవో ఉదయకిరణ్, మురళి, సంధ్య, సునీల్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తెనాలిటౌన్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గ ఎంపిక గురువారం స్థానిక కొత్తపేటలోని ఎన్‌జీవో కళ్యాణ మండపంలో నిర్వహించారు. తెనాలి డివిజన్ అధ్యక్షునిగా అంబటి శ్యామ్‌సాగర్, కార్యదర్శిగా అచ్యుత సాంబశివరావులు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎస్ ఎస్ జహీర్, కోశాధికారిగా షణ్ముకరావు, కార్యవర్గ సభ్యులుగా వేజండ్ల భాస్కర్, సి.హెచ్.రవి కుమార్, సి.హెచ్.చంద్రశేఖర్, ఉన్నం భూషణం ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు కనపర్తి రత్నాకర్ అభినందించారు.

సామూహిక అక్షరాభ్యాసం



తెనాలిటౌన్: స్థానిక పాండురంగ పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ పాల్గొని పిల్లలచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం వార్డులో అంగన్‌వాడీ పిలుస్తోందిరా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లల తల్లులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృత్యుపాశాలు పొంచి ఉండే 'వర్షాకాలం'

- విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం
- అప్రమత్తతతోనే దూరం

తెనాలిరూరల్: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు అధిక అవకాశాలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు, పొలాల్లో విద్యుదాఘాతాలకు గురయ్యే ప్రమాదం ఉందని చుబుతున్నారు. కాసింత అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని సూచిస్తున్నారు. వర్షాకాలం .. వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాల బారిన పడడం ఖాయం. పొలాలకు వెళ్లే రైతులూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదు ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని నీళ్లలోకి వెళ్లాలి. మరోవైపు గ్రామాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండడం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండడం, ఇళ్లకు సమీపం నుంచే తీగలు వెళ్లడం స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవిస్తుటాయి. వీటిపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే వెంటనే 1912కు కాల్ చేయవచ్చని చెబుతున్నారు.

ఇవి చేయకూడదు..

- వానలో విద్యుత్ స్తంభాలను తాకే ప్రయత్నం చేయకూడదు.



విద్యుత్ తీగలకు చుట్టుకున్న పిచ్చి మొక్కలు

- స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- నీటిలో అడుగుల వేసేటప్పుడు అందులో పడి ఉన్న విద్యుత్ తీగలను గమనించి అడుగులు వేయాలి.
- సబ్‌స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకూ దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు. మరమ్మతులు చేయకూడదు.

ఇళ్లలో ఈ జాగ్రత్తలు అవసరం

- ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి
- నీరు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షపు జల్లు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలను ఉంచకూడదు.



చెట్ల కొమ్మల్లో నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు

- చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు
- ప్లగ్‌లను స్విచ్ ఆపకుండా తీయకూడదు.
- నిపుణులతో ఇళ్లకు వైరింగ్ చేయించాలి.
- పరికరాలకు ఉన్న వైర్లను పట్టి లాగకూడదు.

ఇవి ప్రమాదకరం..

- సొంతంగా ఇంటికి వైరింగ్ చేయడం.
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెత్తను వేయడం.
- అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను ఎక్కడం.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మూత్ర విసర్జన చేయడం.
- టెలి, కేబుల్ వైర్లపై దుస్తులు ఆరేయడం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో ప్రజలు కొంత అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. స్తంభాలు పడిపోతున్నాయి. వాటి మరమ్మతులు చేయిస్తున్నాం. అప్రమత్తతతోనే ప్రాణ నష్టం జరుగకుండా ఉంటుంది.

–వీవీ చిరంజీవి, విద్యుత్ డీఈఈ

కూటమి ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయింది

సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ ఆరోపణ

తెనాలిటౌన్: అధికారం కోసం తప్పుడు వాగ్దానాలు చేసి అధికారం చేపట్టాక ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని కూటమి ప్రభుత్వంపై సీపీఐ పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ నిప్పులు చెరిగారు. స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలీ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఎం పట్టణ కార్యదర్శి బాబుప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఇంటిపన్ను బాదుడు, అదానీ విద్యుత్ మీటర్లు బిగించి ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వ ప్రజల విశ్వాన్ని కోల్పోవడమే కాకా వారి ఆగ్రహానికి గురైందని వెల్లడించారు. స్మార్ట్ మీటర్లు పగలకొట్టండి అని గతంలో చెప్పిన కూటమి నాయకులు నేడు గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం వాణిజ్య సంస్థలకు, నివాస గృహాలకు విద్యుత్ మీటర్లు బిగించి వెళ్లిపోతున్నారని మండిపడ్డారు. ఇంటి పన్నులు పెంచమని, కొత్త పన్నులు అమలు చేయమని వాగ్దానాలిచ్చి వాటిని నేరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆగ్రహానికి మరింతగా కూటమి ప్రభుత్వం గురవుతుందని తెలియజేశారు. సమావేశంలో ఎస్.సుబ్రమణ్యం, మొవ్వా ఆదినారాయణ, ఆర్.ఆంజనేయులు, కె.రత్నప్రసాద్, కె.దుర్గా ప్రసాద్, కె.వెంకట రమణ, జి.ప్రసాద్, బి.బ్రహ్మారెడ్డి, ఎస్.రాజ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న బాబు ప్రసాద్

శిల్పకళారంగంలో 'కాటూరి' కృషి ప్రశంసనీయం

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

తెనాలిటౌన్: శిల్పకళారంగంలో కాటూరి కుటుంబం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. గురువారం స్థానిక కాటూరి ఆర్ట్ గ్యాలరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వందలాది కళాత్మక శిల్పాలను ఆయన పరిశీలించారు. గ్యాలరీలో ఏర్పాటు చేసిన భారతమాత, జైజవాన్ విగ్రహాలకు పూలమాల వేసి గౌరవ వందనం చేశారు. ఇక్కడ ప్రతి విగ్రహం సజీవంగా కనిపిస్తుందని అన్నారు. అమరావతిలో ఇటీవల భారత ప్రధాని నరేంద్రమోడీ పర్యటన సందర్భంగా ప్రదర్శించిన భారీ అమరావతి ఐరన్ స్క్రాప్ పెడెస్టల్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, అమెరికన్ బుక్ ఆఫ్‌రికార్డ్స్‌లో స్థానం లభించడం గర్వకారణమని తెలిపారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలను అభినందించారు.



ఆర్ట్ గ్యాలరీ సందర్శిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

విద్యార్థులకు అభినందన



తెనాలిటౌన్: చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా దాని అభివృద్ధికి సహకరిస్తున్న పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని ఎస్‌సీఆర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.కరిముల్లా కొనియాడారు. స్థానిక మారీసుపేటలోని ఎస్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్‌లో గురువారం 1979–80 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ ఏడాది 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సిల్వర్ మెడల్స్, ప్రశంస పత్రాలు పంపిణీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం పి.కరిముల్లా పాల్గొని స్కూల్ మొదటి, రెండోవ, మూడోవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పీఎస్ ఎస్ ప్రసాద్, అహ్మద్ షరీఫ్, రమణబాబు, హనుమంతరావు, ఇబ్రా, వెంకటరెడ్డి, షేక్ కరిముల్లా, వాసు, రాజేశ్వరరావు, చలమయ్య, పోలేరమ్మ, షేక్ నూరుజాహాన్, శ్రీదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థలో పారిశుద్ధ్యం సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ ఆలీంబాషా తెలిపారు. గురువారం ఆయన నగరంలోని వివిధ వార్డులలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త ఎత్తకపోవడం లాంటి సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

పాఠ్య పుస్తకాలు లేకుండానే తరగతులు



ఎస్‌సీఆర్ఎస్ఎం హైస్కూల్లో సివిల్ డ్రెస్‌లో ఉన్న విద్యార్థులు



కొత్తపేట బాలికోన్నత పాఠశాలలో పాత యూనిఫాం, సివిల్ డ్రెలో విద్యార్థినులు

తెనాలిరూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్‌లను అధికారులు సెలవుల్లోనే సిద్ధం చేసే వారు. విద్యార్థులు కొత్త యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, విద్యా కానుకలతో సంతోషంగా బడికి వెళ్లే వారు.

అలాంటిది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, విద్యా కానుక కిట్‌లను సిద్ధం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఫలితంగా పాఠశాలలు తిరిగి ప్రారంభమైన గురువారం విద్యార్థులకు పుస్తకాలు లేకుండానే తరగతులు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులను ఉపాధ్యాయులు పాఠాలను బోధించకుండానే నిర్వహించాల్సి వచ్చింది. పాఠ్యపుస్తకాలు లేక, యూనిఫాం లేకుండానే విద్యార్థులు సివిల్ డ్రస్సుల్లోనే తొలిరోజు హాజరయ్యారు. కొందరు విద్యార్థులు పాత యూనిఫాంను ధరించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



బాయ్స్ హైస్కూల్లో ఇంటి నుంచి తెచ్చుకుని భోజనాలు చేస్తున్న విద్యార్థులు

సంక్షేమ పాలన– సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం

రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖమంత్రి మనోహర్

తెనాలిటౌన్: సంక్షేమ పాలన–సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం పని చేసిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని జనసైనికులు, వీర మహిళలతో ఆయన సమావేశమయ్యారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని నేతలతో పంచుకున్నారు. తెనాలి నియోజకవర్గంలో 74 కోట్ల రూపాయల అభివృద్ధి చేసినట్లు తెలియజేశారు. 400 కోట్ల రూపాయలతో వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. తెనాలి నుంచి నారాకోడూరు, మంగళగిరి నుంచి తెనాలి వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణకు 650 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించినట్లు తెలియజేశారు. త్వరలో టెండర్లు పిలువబోతున్నట్లు వెల్లడించారు. భావితరాల భవిష్యత్‌కు వినియోగపడేలా ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపడమే తన ధ్యేయంగా వివరించారు. అనంతరం జనసైనికులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో పలువురు జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.



జనసైనికులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ పోస్టర్ ఆవిష్కరణ

తెనాలిటౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మరో ప్రతిష్టాత్మక సేవా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి తెలిపారు. గురువారం తెనాలి పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీపాదం పేరిట సౌకర్యవంతమైన కృత్రిమ కాళ్ల ఉచిత పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ మంగళగిరి, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సంయుక్తంగా చేపట్టిన సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గవర్నర్ డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రత్యేకమైన మోకీలు వ్యవస్థ కలిగిన 120 ప్రభ ఫుట్, కృత్రిమ కాళ్లను కోల్పోయిన దివ్యాంగులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కాళ్లను ఉపయోగించి నడవడం, మెట్లు ఎక్కడం, మడిచి కూర్చువడం వంటి దైనందిన కార్యకలపాలు సులభంగా చేసుకోవచ్చని చెప్పారు. కాళ్లు లేని దివ్యాంగులు 72074 03150 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను ఫోటోలను జత చేసి ఈ ప్రభ ఫుట్ కృత్రిమ కాళ్లు ఉచితంగా పొందడం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 9 నుంచి 15 వరకు మంగళగిరి ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే శిబిరంలో కృత్రిమ కాళ్లు అందజేయబడతాయని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ గురువు వడ్లమాను రవి, పూర్వ గవర్నర్‌లు ప్రభాకర్, రమేష్, టి.రాజశేఖర్‌రెడ్డి, రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ కె.మురళీమోహన్ రావు, ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి రాజశేఖర్, నీరంజన్ గుప్తా ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

కొలకలూరులో విద్యా చైతన్య ప్రచారోద్యమం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ దినోత్సవాన్ని పురస్కరించుని విద్యాచైతన్య ప్రచారోద్యమం నిర్వహించారు. తల్లిదండ్రులు తాతాల తరాలనుంచి వచ్చే వృత్తిలోనే జీవనం కొనసాగిస్తున్నారు. కానీ చదువు వలన అభివృద్ధి చెందిన జీవితాలు, కుటుంబాలు ఉన్నత స్థానంలో నిలబడతాయని చదువు భవిష్యత్‌కు దోహదపడుతుందని జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు అన్నారావు పేర్కొన్నారు. మూఢ నమ్మకాలను ప్రతి ఒక్కరూ తమబిడ్డలను చదివించాలని, బాల కార్మిక నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకల సుబ్బారావు, శివశంకర్, సచివాలయ మహిళ పోలీసు మల్లిక, డిబిఆర్‌సీ సీటీ కో–ఆర్డినేటర్ కంచర్ల రజిని, తదితరులు ఉన్నారు.

అమ్మో.. జూన్ నెల!!

- పాఠశాలల్లో ఫీజుల మోత...
- పుస్తకాలు, బ్యాగుల ఖర్చు తడిసి మోపెడు
- తల్లిదండ్రుల గుండెల్లో భారం

తెనాలిరూరల్: జూన్ నెల.... మే నెల ఎండల వేడి చల్లారకముందే, జనాన్ని ఆర్థిక సెగ ఉక్కిరిబిక్కిరి చేసే మాసం. వేసవి సెలవులు పూర్తిచేసుకుని తెరుచుకున్న బడుల్లో మోగే గంట, సగటు జీవుల గుండెల్లో హెచ్చరిక గంటలను తలపిస్తుంది. గతేడాది నుండి అమ్మొడి లేక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులకు ప్రస్తుత జూన్ మాసం అందరిలోనూ టెన్షన్ తెచ్చింది. పాఠశాలలు ఈనెల గురువారం పునఃప్రారంభమయ్యాయి. ప్రైవేటు పాఠశాలలు/ కాలేజీల్లో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి కావచ్చాయి. నర్సరీ నుంచి ఇంజినీరింగ్ వరకు చదువుకునే విద్యార్థులకు తలిదండ్రులకు ఈనెల బిడ్డల చదువుకు అవసరమైన ఫీజుల నుంచి పుస్తకాలు, యూనిఫాం, స్కూల్ బ్యాగు, బూట్లు, లంచ్ బాక్సుతో సహా అన్ని అమర్చి పెట్టడానికి తగిన డబ్బును సమకూర్చుకోవటం తప్పనిసరి అని తెలిసిందే. స్తోమత కలిగినవారు డబ్బుతో పనిలేకుండా పాఠశాల పేరు, స్థాయి ఆధారంగా పిల్లలను చదివిస్తుంటారు. సాధారణ, మధ్యతరగతి ప్రజలు పలువురు తమ బిడ్డల చదువుకు కాన్వెంట్లను కార్పొరేట్ విద్యాసంస్థలకేసి చూస్తుండటం కొన్నేళ్లుగా పరిపాటిగా మారటం తెలిసిందే.

15–20 శాతం పెరిగిన ఫీజుల భారం

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోతకు తగ్గట్టుగా ఆదాయం లేకపోయినా అప్పోసప్పో చేసి పంటి బిగువుతో బిడ్డలను చదివిస్తున్న తల్లిదండ్రులు ఎందరో! గతేడాది ఫీజుల భారంగా ఉన్నాయనుకుంటే ఈ ఏడాది 15 నుంచి 20 శాతం పెరుగుదల కనిపిస్తోందని చెబుతున్నారు. చిన్నతరహా, మధ్యతరహా, కార్పొరేట్ పాఠశాలలుగా వీటిని విభజిస్తే ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఫీజులను వింటే కళ్లు తిరగాల్సిందే. ఎల్‌కేజీ రూ.40 వేలుతో మొదలుకొని, పదో తరగతికి వచ్చేసరికి రూ.లక్షకు పైగా వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ఇవే ఫీజులను మధ్య తరగతి పాఠశాలల్లో రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు, దిగువస్థాయి విద్యాసంస్థల్లో రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నాయి. స్పెషల్ ఫీజులు, పుస్తకాల ఖర్చులు అదనం. వీటికితోడు యూనిఫాం, స్కూల్‌బాగ్, లంచ్ బాక్సు, బూట్లు ధరలకు ఏటికేడాది రెక్కలు వస్తున్నాయి.



పుస్తకాల దుకాణంలో కొనుగోళ్లు



స్కూల్‌బ్యాగులకు రద్దీ

రకరకాల ఎత్తుగడలతో విద్యార్థులకు ఎర...

విద్యార్థులను ఆకర్షించడానికి ప్రైవేటు పాఠశాలలు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నాయి. ప్రాథమికస్థాయిలో అబాకస్/ ఒలంపియాడ్ శిక్షణ, హైస్కూలు స్థాయిలో ఐఐటీ/ నీట్ ప్రోగ్రాంస్ శిక్షణ ఇస్తామంటున్నారు. వైద్యశాలల్లో ఆరోగ్య పరీక్షలు వివిధ రకాల ప్యాకేజీలున్నట్టు పాఠశాలల్లోనూ రకరకాల శిక్షణల పేరుతో ప్యాకేజీలను నిర్ణయిస్తున్నారు. కేవలం సిలబస్ కాకుండా అదనపు శిక్షణ ఉంటుంది కదాన్న ఆలోచనతో తలిదండ్రులు ఆర్థికభార మైనా, అటుకేసి మొగ్గు చూపుతున్నారు... నిలువు దోపిడీకి గురవుతున్నారు. పాఠశాలలను జీఎస్‌టీ నుంచి మినహాయించిన కొన్ని యాజమాన్యాలు ఆ పేరుతోనూ విద్యార్థుల నుంచి డబ్బులు గుంజుతున్నట్టు సమాచారం. ఇంజినీరింగ్ కాలేజీలైతే డిమాండ్ కలిగిన కోర్సులకు ఫీజులు కాకుండా రూ.లక్ష నుంచి రూ. ఆరు లక్షల వరకు డొనేషన్లను వసూలు చేస్తున్నాయి.

సంపాదనంతా చదువులకే సరిపోతోంది

జూన్ నెల వచ్చిందంటే డబ్బు సర్దుబాటుకు ఇబ్బందులే. మాకిద్దరు ఆడపిల్లలు. వారి చదువులకే జీతమంతా సరిపోతోంది. స్కూలు ఫీజులు, పుస్తకాలకు, యూనిఫాంలని ఈ నెలలోనే అధిక ఖర్చులు ఉంటాయి. ఫీజులకు పోటీగా దుస్తులు, పుస్తకాల రేట్లు పెరుగుతూనే ఉన్నాయి. వీటన్నింటికీ సర్దుకునేలోగా మరో నెల వచ్చిపడుతుంది. గతేడాదితో పోల్చితే ఈ సారి కనీసం 15 నుంచి 20 శాతం పెరిగాయి. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..

– కరిముల్లా, తెనాలి

పేదల జీవితాలతో చెలగాటం

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. కొన్నిచోట్ల పాఠశాలల పేర్లతో ముద్రించిన పాఠ్య, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయిస్తున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు మరింత భారం పడుతోంది. అధిక ఫీజుల నియంత్రణతో పాటు విద్యాసామగ్రి విక్రయాలపై ఆందోళనలు చేసిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలలో మార్పు లేదు. ఏఐఎస్ఎఫ్ తరపున మూడు రోజుల క్రితమే తెనాలిలో ఆందోళన చేపట్టాం.

– పాశం వెంకటేష్, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై యాజమాన్యం స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ విజ్ఞప్తి చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 191 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని.. యాజమాన్యం కానీ ప్రభుత్వం కానీ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రతి కార్మికుడు వయసు మీద పడి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల దుర్గారావు, కె.ఆదినారాయణ, సూర్య ప్రకాష్, కార్మికులు ఇమాంబీ, ఆశీర్వాదం, గురవయ్య, సారమ్మ, సుభాని, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎంసీకి రూ.3.40 కోట్ల విలువైన వాహనాలు



మంగళగిరి, మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థకు సుమారు రూ.3.40 కోట్ల విలువైన మూడు అధునాతన వాహనాలు గురువారం చేరాయి. చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్న రెండు కాంఫాక్టర్లు ఎంటీఎంసీకి చేరుకున్నాయి. ఒక్కో కాంఫాక్టర్ ధర రూ.1.48 కోట్లు. ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాలను ఈ కాంఫాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఈ వాహనాలు వినియోగంలోకి వస్తే ఎక్కడా చెత్త బయటకు కనిపించదని.. వాహనాల నుంచి రోడ్లపై చెత్త పడదని అధికారులు చెబుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో బీటీ రహదారులపై ఏర్పడే గుంతలు పూడ్చేందుకు రూ.1.48 లక్షల విలువైన పార్ట్‌హోల్ రిపేర్ వాహనాలను కూడా అధికారులు ఎంటీఎంసీకి సమకూర్చారు. త్వరలో స్థానిక మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

•విద్యామిత్ర కిట్‌లు పంపిణీ

దుగ్గిరాల: పునః ప్రారంభం రోజునే మండలంలోని విద్యార్థులకు 'డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు' పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గురువారం దుగ్గిరాల మండల గ్రామాల లోని అన్ని పాఠశాలల 3,639 మంది విద్యార్థులకు విద్యామిత్ర కిట్‌లను అందించారు.